# కవిగారూ - కరుణించండి !

చిట్టి పొట్టీలకి కొత్త పిల్లాడొకడు స్నేహితుడయ్యాడు. అతని పేరు కీర్తి. కొత్తగా స్కూల్లో చేరేడు. అతడు గూడా వీళ్ళిద్దరితోపాటు ఒకే బెంచీలో కూర్చున్నాడు. కొద్ది రోజుల్లోనేవాళ్ళకి బాగా స్నేహం అయింది.

ఆ కద్ది రోజులపరిచయంలోనే కీర్తి నుంచి అనే విషయాలు రాబట్టుకున్నారు, కీర్తి తండ్రి పెద్ద కవిట. పేరేదో చెప్పాడు గానీ వీళ్ళకి గుర్తులేదు. మొదట్లో తనకోసం , ఆపైన జనం కోసం ఇప్పుడిప్పుడు సినిమాలకోసం పాటలు, పద్యాలు వ్రాస్తున్నాట్ట. బాగా సంపాయిస్తున్నాట్ట. సొంత ఇంటిని ,వాళ్ళమ్మకి బోల్డు నగలని అమర్చిపెట్టాడు. త్వరలో కారుగూడా కొనాలనుకుంటున్నాట్ట. కారుకొనగానే చిట్టీ, పొట్టీలను గూడా ఎక్కించుకు తిరుగుతానని వాగ్దానం చేసేడు కీర్తి.

చిట్టి పొట్టీలు ఎంతో వుబ్బితబ్బిబ్బయ్యారు. కీర్తిలాంటి గొప్పవాళ్ళబ్బాయి తమ స్నేహితుడు కావటం తమ అదృష్టంగా భావించేరు. వాళ్ళిద్దరికి ఎప్పుడూ అతడిగురించే చర్చలు, కీర్తి వేసుకునే బట్టలగురించి , అతడి వ్రేలికున్న ఎర్రరాయి వుంగరం గురించి, అతడి ఇంటిని గురించి , ఇంటిలో ఖరీదైన వస్తువుల గురించి, అతడు చెప్పే కబుర్లగురించి.

పరిచయం అయ్యి ఇన్నాళ్ళయినా కీర్తి తండ్రిని చిట్టిపొట్టి ఇతంవరకు చూడనేలేదు. ఒకసారి కీర్తిని అడిగారు కూడా వాళ్ళ నాన్నని చూపించమని.. కాని కవిగారు సాధారణంగా కొంపపట్టున వుండరు. అంచేత కీర్తి స్నేహితుల కోర్కెతీర్చే వీలు చిక్కిందికాదు. సమయంకోసం ఎదురుచూడసాగేడు.

కీర్తికి తన వాగ్దానాన్ని నెరవేర్చుకునేవీలు రెండు నెలల తర్వాత కలిగింది. కవిగారికి ' లివర్ ట్రబు'లొచ్చి కొన్నాళ్ళు ఇంటిపట్టునే వుండిపోయేరు. అది అదనుగా తీసుకుని కీర్తి చిట్టి, పొట్టి లను తనింటికి ఆహ్వానించేడు. వాళ్ళు సంతోషంగా అంగీకరించేరు.

మర్నాడు స్కూలుకి సెలవు కాబట్టి ఆరోజు రమ్మని చెప్పాడు. సరేనన్నారు మనవాళ్ళు.

ఆ మర్నాడు వుదయ్యాన్నే చిట్టి,పొట్టి నిర్ణీత స్థలంలో కల్సుకుని కీర్తి ఇంటికి బయల్దేరారు. నిజానికి అతడిల్లు చాలా దూరం అయినా ఓపిగ్గా నడుచుకుంటూ వెళ్ళారు.

అదొక పదంతస్థులు భవనం, ఆ పధంస్థుల భవనం అంతా కవిగారిదికాదు. అందులో ఒక భాగం మాత్రమే . దాన్ని ఫ్లాట్ అంటారని కీర్తి చెప్పాడు. చిట్టికి పొట్టికి తెలీని చాలా విషయాలు కీర్తి చెప్పాడు. – లిఫ్ట్ గురించి , ఫ్రిజ్ గురించి , వీసీయార్ గురించి చాలా చెప్పాడు. మిత్రులిద్దరూ నోళ్ళు తెరుచుకుని వింటూనే వున్నారు.

ఇల్లుగూడా చాలా పెద్దది. అద్దంలాగా శుభ్రంగా వుంది. అందంగా గూడా వుంది. ఇల్లంతా విచిత్రమైన సామాన్లు . చిట్టి పొట్టి వెళ్ళేసరికి కవిగారు డాక్టరువద్దకెళ్ళార్ట. అంచేత కీర్తి వాళ్ళిద్దర్ని డ్రాయింగ్ రూంలో కూర్చోపెట్టి అదేపనిగా అనేక విషయాల గురించి చెపుతున్నాడు. వింటున్న చిట్టి దృష్టి అక్కడ ఏ టేబిలుపై వున్న ఒక వస్తువుపై బడింది. దానివంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

అది గమనించిన కీర్తి చెపుతున్న విషయాన్ని వొదిలేసి, చిట్టిని ఆకర్షించిన దాన్ని గురించి చెప్పసాగేడు. ‘ దాన్ని త్రీ ఇన్ వన్ ’ అంటారు మా డాడీ. తను వ్రాసిన పాటలన్నీ ఇందులో వింటారు. కొత్తగా మా డాడీ రాసినపాట అందులోవుంది.వింటారా ? అన్నాడు.

చిట్టి పొట్టి వుత్సాహంగా తలలూపేరు. కీర్తి వెళ్ళి హార్మనీ పెట్టలావున్న దాన్లో ఏదో నొక్కేడు. పాటమొదలైంది. – ‘ నువ్వూ నేనూ కౌగిలించకుంటే హాయ్ హాయ్ – ముద్దు పెట్టుకోవా మోహనాంగీ – నన్ను పెట్టుకోనీ కోమలాంగి ’ ఇదీఅ పాట. ఒక చరణం పూర్తికాకుండానే కవిగారు కోపంగా గదిలోకొచ్చేరు.....వస్తూనే ‘ కీర్తి ’ యూ ఫూల్ – ఆ పాటలు వినొద్దన్నానా ’ అంటూ దాని నోరు నొక్కేసారు ‘ అది కాదు – డాడీ – ’ కీర్తి ఏదో చెప్పబోయేడు. “ పొండి బయటికి ” అంటూ విసుక్కున్నారు.

“ కవిగారూ ! మీ కీర్తిలాంటి వాళ్ళే మిగతా పిల్లలు గూడా. కాస్త మీ కలానికి మంచి చెడు నేర్పండి. రేపటి మన చరిత్రని బూతుకావ్యం చెయ్యకండి – ప్లీజ్ – కరుణించండి ”

------- అయ్యిపోయింది -------